# నాకు నచ్చిన కథ "చావద్దు"

--అబ్బూరి ఛాయాదేవి

నేను స్త్రీ వాదం పట్ల కొంత అవగాహన ఉన్న దాన్ని కావడం వల్లనూ, స్త్రీల సమస్యల్ని తీసుకుని కొన్ని కథలు రాసిన దాన్ని కావడం వల్లనూ స్త్రీల సమస్యల పట్ల సదవగాహనతో రాసిన కథలు నన్ను ఆకర్షిస్తాయి.

ఎన్నో మంచి కథలు రాసిన ప్రసిద్ధ రచయితా, చిత్రకారుడూ అయిన శీలా వీర్రాజు గారి కథల్లో నాకు నచ్చిన కథల్లో "చావద్దు" అనే కథ ఒకటి. ఈ కథ ప్రప్రథమంగా 1976 లో అచ్చయింది.

1959 - 1976 మధ్య కాలంలో అచ్చయిన శీలా వీర్రాజుగారి తొమ్మిది కథల సంపుటాల్లోంచీ రచయిత తనకు నచ్చిన ముప్ఫయి నాలుగు కథల్ని ఎన్నికచేసి 'శీలా వీర్రాజుకథలు' అనే సంపుటిని 1989 లో ప్రచురించారు. ఆ సంపుటంకోసం రచయిత ఎంచుకున్న కథల్లో "చావద్దు" కథ కూడా ఉంది.

1976 తర్వాత వీర్రాజుగారు మళ్లీ కథ రాయలేదట - కవిత్వం వైపు మొగ్గు చూపటం వలన. 'ఇప్పుడు నేను కథ రాస్తే యిలా రాయలేనని కూడా నాకు తెలుసు' అని రచయిత అన్నప్పటికీ, ఆయన ఇప్పటికీ అలా ప్రతిభావంతంగా రాయగలరనీ, ఇంకా రాయాలనీ అనిపిస్తుంది 'చావద్దు' అనే కథ చదివితే. ఎంత సామాన్యవ్యక్తి అయినా, తనకు న్యాయమని తోచినప్పుడు సమాజాన్ని ఎంత సులభంగా - ఎటువంటి ఉద్యమాల అవసరమూ సహకారమూ లేకుండానే - ఎదిరించగలడో, సమాజానికి ప్రతినిధి అయిన తన మనస్సునే ఎలా జయించగలడో స్పష్టంగా చూపిస్తుందీ కథ. మానసిక పరిణతికి ప్రతీక ఈ కథ.

వీర్రాజుగారి కథలన్నీ - ఆయన మాటల్లోనే - "సున్నితమైన, ఆర్ద్రమైన మనస్తత్వాన్ని చిత్రించే కథలు.... నాణానికి బొమ్మా, బొరుసూ రెండూ వుంటాయని తెలిసినా, బొమ్మవైపు మాత్రమే చూడ్డానికి అలవాటు పడిన రోజులవి. ఆ రోజుల్లో వచ్చిన కథలేయివి" అన్నారు. కానీ, "చావద్దు' ' అనే కథలో బొమ్మతో పాటు బొరుసుని కూడా స్వీకరించగల పరిణతినీ, జీవితం పట్ల సదవగాహననీ, స్త్రీ పురుష సంబంధాలపట్ల న్యాయదృష్టినీ, ప్రేమతో కూడిన విశాల దృక్పథాన్నీ కథానాయకుడిలో చూపించారు రచయిత.

వీర్రాజుగారు చిత్రకారుడూ, కవీ కనుక సహజంగా ప్రకృతి సౌందర్యోపాసకుడు. ఆయన కథల్లో ప్రకృతి వర్ణనలు (స్త్రీ కూడా ప్రకృతిలో భాగంగా) విరివిగా కనిపిస్తాయి. తాపీగా చదివి రసాస్వాదన చేయదగినట్లుగా ఉంటాయి. అయితే 'చావద్దు' అనే కథలో వేగం ఉంది. పాఠకునికి ఉత్సుకత కలిగించే లక్షణం పుష్కలంగా ఉంది. ఏ కథకయినా ఉండవలసిన ముఖ్య లక్షణాల్లో అదొకటి కదా.

"రంగులంటే నాకు యిష్టం. ఊహ తెలిసినప్పటి నుంచీ జీవితాన్నీ, లోకాన్నీ రంగుల్లోనే చూడటానికి అలవాటు పడ్డాను... ఆ అభిరుచే పాఠకుడ్ని నా వెంట తీసుకెళ్లి ప్రతి దృశ్యాన్నీ రంగుల్లో చూపించే ధోరణి నా కథల్లో ఏర్పడటానికి కారణం కావచ్చు" అని రచయిత చెప్పుకున్నారు. కానీ, "చావద్దు" అనే కథలో మనకు చూపించినది రంగుల కల కాదు. నీటి రంగుల చిత్రంకూడా కాదు. కలకాలం నిలిచే తైలవర్ణ చిత్రం వంటిది. వాస్తవిక జీవిత చిత్రం. కఠోర వాస్తవాన్ని జీవితంలో ఎలా ఎదుర్కోవాలో తెలియజెప్పే కథాచిత్రం.

సనాతన ధర్మాన్ని ప్రబోధించే సమాజాన్నీ, భర్త వైముఖ్యాన్నీ ఎదుర్కోలేక ఆత్మహత్యకు పాల్పడబోయే స్త్రీకి "చావద్దు" అని ధైర్యం చెప్పి, మళ్లీ జీవితం మీద మమకారాన్ని కలిగింపజేసే కథ ఇది.

"చిన్నప్పటినుంచీ జీవితాన్ని ప్రేమించడం అలవరచుకున్నాను...." అంటారు రచయిత తమ కథా సంపుటికి ముందుమాటలో. అందువల్లనే, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నపూర్వకంగా "చావద్దు' ' అనే ప్రబోధనాత్మకమైన కథ రాయగలిగారు.

భార్య ఆసుపత్రిలో ఉంది, వెంటనే రావలసిందని అత్తవారి ఊరునుంచి కబురు అందగానే కంగారుగా బయలుదేరి వస్తాడు భర్త. అత్తవారింట్లో వాళ్లూ, ఇరుగుపొరుగు వాళ్లూ కూడా అతనికేసి జాలిగా చూస్తారే కాని, భార్యకి ఏం జబ్బు చేసిందో, ఎలా ఉందో చెప్పరు. చివరికి డాక్టరు చెబుతాడు అసలు సంగతి.

భార్య సామూహిక అత్యాచారానికి గురైందని తెలుసుకున్న తరవాత ఆ భర్త ప్రవర్తననీ, ఆలోచనల్నీ వివరించిన తీరు సహజంగానూ, ప్రశంసనీయంగానూ ఉంది. ఆ విషయం డాక్టరు నోట భార్య గురించి విన్న వెంటనే భార్యముఖాన్ని చూసి ఆప్యాయంగా పలకరించలేకపోయాడు. నలుగురిలో తలెత్తుకు తిరగలేకపోయాడు. రాత్రంతా నిద్రపట్టక మానసిక సంఘర్షణకి గురైయాడు. "తను ఒక సామాన్యుడు. రాగద్వేషాలకు అతీతంకాని అతి సామాన్యమైన మనసు తనది. ఇలాంటి మనసు ఉన్నతంగా ఎలా ఆలోచించగలుగుతుంది? తను ఒక మహాత్ముడిలాగ ఎలా ప్రవర్తించగలడు?...." అనుకుంటాడు. కానీ, క్రమంగా మాటిమాటికీ తనకి తెలిసిన యిద్దరు వ్యక్తులు గుర్తుకొచ్చారు - రాములు, హుస్సేనీ - వాళ్లిద్దరూ తనలాంటివారే. అతి సామాన్యులే..... అని గుర్తుకొచ్చిన తరవాత మనసుని అదుపులో పెట్టుకున్నాడు. భార్యని సముదాయించగల స్థితికీ, భార్యకి ధైర్యం చెప్పగల స్థితికీ చేరుకున్నాడు.

ఎటువంటి ఆదర్శ ప్రవచనాలూ లేకుండా, వాస్తవిక దృష్టితో కథనీ, కథానాయకుడి మనస్తత్వాన్నీ మలచిన తీరు గొప్పగా ఉంది.

చలం శత జయంతిని జరుపుకుంటూన్న సందర్భంలో ఇటువంటి కథని మరోసారి శ్రద్ధగా చదవాలి. స్త్రీ పురుష సంబంధాలనూ, వివాహబంధాన్నీ అన్ని కోణాలనుంచీ అవగాహన చేసుకోవడానికి దోహదం చేస్తుందీ కథ.

## నాకు నచ్చిన కథ

# చావద్దు

శీలా వీర్రాజు

ఇల్లు యింకా వంద గజాల దూరంలో వుంది. అరుగు మీద జనం కనిపించడంలేదు. ఏమయినా జరిగివుంటే జనం యింటి ముందు పోగయివుండేవారు. నేల కూడా బురదతో తడిగాలేదు.

ప్రాణం కొంత కుదుటపడింది. నూటయాభై మైళ్ళ దూరం నుంచి బిగబట్టిన భయం. యాభై గజాల దూరం నుంచి బిగబట్టిన ఊపిరి ఒక్కసారిగా సడలిపోయింది. హమ్మయ్య అనుకున్నాడు. రిక్షా గుమ్మం ముందు ఆగింది.

రిక్షా ఆగడం చూసి చుట్టుపట్ల యిళ్ళ వాళ్ళు అరుగుమీదికి వచ్చి చూస్తున్నారు. కొందరు తలుపుల వెనకనించి, మరి కొందరు కిటికీల అవతలనించి.

వాళ్ళు అలా చూడ్డం ఏమిటోలా వుంది. ఇంతకు ముందు అనేకసార్లు వచ్చాడు. అప్పుడు యిలా చూళ్ళేదు. యధాలాపంగా చూసి కాస్సేపు సరదాగా ఆసక్తిగా నిలుచునేవారు. ఇప్పుడు సర




దాలేదు. ఆసక్తి మాత్రం వుంది. దానితో పాటు జాలి కూడా.

వాళ్ళు అలా చూస్తోంటే మళ్ళీ భయం వేసింది. గుండె దడ దడ లాడింది. రిక్షా వాడికి డబ్బులిచ్చి మెట్లు ఎక్కుతోంటే కాళ్ళు తడబడ్డాయి. ఊపిరి బిగపట్టాడు. తలుపు తట్టాడు.

ప్రభ వచ్చి తలుపు తీసింది. "రా బావా" అంది.

ఆమె పిలుపులో జీరలేదు చూడ గానే బావురుమనలేదు. ఓ నిమిషం ఆగిపోయినట్లు అనిపించిన గుండ మళ్ళీ కొట్టుకోవడం మొదలెట్టింది.

"మీ అక్కయ్య కెలా వుంది?"

"కొద్దిగా కోలుకుంది. హాస్పిటల్లో చేర్పించాం"

"ఇంతకీ జబ్బేమిటి?"

ప్రభ మాట్లాడలేదు. "అమ్మా నాన్నా హాస్పిటల్లోనే వున్నారు. స్నానం చేసి వెళ్ళు దువుగాని కోటిగాడ్నిచ్చి పంపుతాను... ఒరేయ్ కోటీ! భూషణం బావ వచ్చా డురా"

ప్రభ లోపలకి వెళ్ళిపోయింది. నాగ భూషణం నడవాలో నుంచుండి పోయాడు. బిక్కు బిక్కుమంటున్నట్టుంది. గోడలు మౌనంగా నిల్చుని పరిశీలనగా చూస్తున్న ట్టున్నాయి. ఎదురుగా నిల్చుని పలకరిం చకుండా జాలిగా చూస్తున్న బంధువుల్లా వున్నాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. మాటలురాని వెర్రిదానిలా దిగాలుగా వుంది. ఆ మూల రేడియో. ప్రభ యింట్లో వుండి కూడా రేడియో అలా మూగపో వడం ఆశ్చర్యంగానే వుంది. ఆమెకు పాటల పిచ్చి. ఎప్పుడూ రేడియో వాగుతూ వుండా ల్సిందే. సిలోనో, వివిధభారతో, మరోటో

